


# సమస్యలు - పరిష్కారాలు

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



సమస్య రాగానే మనం పరిష్కారం ఆలోచించటం మానేసి, విచారించటం ప్రారంభిస్తాం.

సముద్రం ఎంత పెద్దదైనా, నీళ్ళని లోపలికి రానివ్వకపోతే పడవ మునగదు. సమస్య ఎంత పెద్దదైనా, మనసులోకి రానివ్వకపోతే బాధ ఉండదు.

పాతికశాతం సమస్యలు పరిష్కారం లేనివి. పరిష్కారం లేని ఈ పాతిక శాతం గురించీ మనం జీవితంలో సగభాగం ఆలోచిస్తూ గడిపేస్తాం. ఇంకో యాభై శాతం సమస్యలు మనకి ఇతరుల వల్ల వచ్చేవి. అవి తీరాలంటే మారవలసింది వాళ్ళు. మనం కాదు. తాగుబోతు భర్త, దుబారా భార్య, గయ్యాళి అత్తగారు, చెడుదార్లో సంతానం వగైరా. వాళ్ళని మార్చటం ఎలా అని నిరర్థకంగా విచారిస్తూ మరో పాతిక శాతం కాలం గడిపేస్తాం. మిగిలిన పాతిక శాతం సమస్యల్నుంచి బయటపడాలంటే కఠినమైన నిర్ణయాలు అమలు జరపాలి. దురదృష్టవశాత్తూ ఇటువంటి సందర్భాల్లో మనం ఆలోచిస్తూ కూర్చుంటాము తప్ప నిర్ణయాలు తీసుకోము. తీసుకున్నా, అమలు జరపం.

...

ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో, ఆ నిర్ణయాన్ని ఎలా అమలు జరపాలో, ఏ సమస్యకి ఎలాంటి నిర్ణయం తీసుకుంటే సమస్య తాలూకు సాంద్రత తగ్గుతుందో ఆత్మీయంగా చెప్పే పుస్తకం.

బొమ్మలు: డా. జయదేవ్

## ముందు మాట

**ఈ** పుస్తకంలోని చాలా ప్రశ్నలు నవ్య, సాక్షి మొదలైన పత్రికలలో ప్రచురింపబడినవి. కొన్ని ప్రశ్నలు, సభల్లో ఉపన్యాసం అనంతరం శ్రోతలు అడిగినవి, మరి కొన్ని మిత్రుల మధ్య జరిగిన సంభాషణలో దొర్లినవి. కేవలం రెండు ప్రశ్నలు మాత్రం సమాధానం ఇవ్వటం కోసం సృష్టింపబడినవి.

కొన్ని సమాధానాల్లో కొన్ని కొటేషన్లు, చిన్న చిన్న కథలు, సంఘటనలు, సందర్భాలబట్టి గతంలో వ్రాసిన పుస్తకాల నుంచి పునరుద్ధాటించబడినవి. వీలైనంత ఎక్కువ మంది పాఠకులకు విషయం చేరాలనే ఉదేశంతో వాటిల్ని తిరిగి ప్రస్తావించడం జరిగింది. వీటిని అంతకు ముందే చదివిన పాఠకులకు ఈ పునరుక్తి విషయమై క్షమాపణలు. ఇక్కడ, సమాధానాల కన్నా... ప్రశ్నలు ముఖ్యమని ఉద్దేశ్యం. ప్రస్తుతం యువత ఎలాంటి సమస్యలతో బాధపడుతోందన్న విషయం తెలియజెప్పటంకోసం, జవాబుల్ని పునరుక్తీకరించటం జరిగింది. అదే విధంగా, కాపీ రైట్ లేని ఇంటర్నెట్ బొమ్మలు కొన్ని వాడుకోవటం జరిగింది. ఆ అజ్ఞాత కళాకారులకి కృతజ్ఞతలు.

చివరిగా ఒక మాట.

ఈ ప్రపంచంలో ఏ ఇద్దరి అభిప్రాయాలూ ఒకలా ఉండవు. ఇందులోని కొన్ని అభిప్రాయాలు కొంతమందికి నచ్చకపోవచ్చు. మరి కొందరికి కడుపులో దేవినట్టుగా కూడా అనిపించవచ్చు. ముందే చెప్పినట్టు ఎవరి అభిప్రాయాలు వారివి. దీనికోసం వాదనలు, ప్రతివాదనలు అనవసరం. వాదించేటప్పుడు మనం అవతలి వారిని అర్థం చేసుకోవటానికి వినం. మనం గెలవటానికి వీలుగా జవాబు ప్రిపేర్ చేసుకుంటూ వింటాం. ఇద్దరు రెచ్చిపోయి దీర్ఘంగా వాదించుకుంటున్నారంటే, అందులో ఒకరు మూగ, మరొకరు చెవిటి.

మూగ వాడికి అందరూ చెవిటి వాళ్ళలాగా కనబడతారు. చెవిటి వాడికి ప్రపంచమంతా మూగగా ఉన్నట్టు అనిపిస్తుంది. అర్థం – పర్థం లేని వాదనల పరమార్థం ఇదే.

వాదనలో గెలవటానికి అత్యుత్తమ సాధనం చిరునవ్వు. ఇతరులతో వచ్చే చాలా సమస్యల్ని 'నవ్వు' పరిష్కరిస్తుంది. 'మౌనం' సమస్యల్ని రాకుండా చేస్తుంది.

–రచయిత.

ఓ సోదరి, వీరవాసరం:

సర్. నేనూ, ఓ అబ్బాయీ ప్రేమించుకున్నాం. పెళ్ళి కూడా చేసుకుందాం అనుకున్నాం. కానీ అతనికి సిగరెట్ తాగే అలవాటు ఉందని ఈ మధ్యే తెలిసింది. నాకు సిగరెట్ తాగేవాళ్ళంటే అసహ్యం. అందుకే అతనికి 'నో' చెప్పాను. కానీ అతను మేమిద్దరం కల్సి దిగిన ఫోటోలతో నన్ను బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. అతని బారి నుండి నన్ను రక్షించుకొనే ఓ పరిష్కారం చూపించగలరని ఆశిస్తున్నాను.

మీ ఇద్దరూ దిగిన ఫొటోలు ఎలాంటివో చెప్పలేదు., బ్లాక్ మెయిల్ చేసే భంగిమలతో ఫొటోలు దిగే వరకూ తనకి సిగరెట్ తాగే అలవాటు ఉందన్న విషయం మీకు తెలీకుండా మేనేజ్ చేసినందుకు ఆ కుర్రవాడిని అభినందించాలి. 'అలాంటి' ఫొటోలు కాకపోతే అతడు ఏ విధంగా బ్లాక్ మెయిల్ చేస్తున్నాడో మీరు వివరించ లేదు. పోలీస్ రిపోర్ట్ ఇవ్వటం ద్వారా మీరు మీలాంటి చాలామంది అమ్మాయిలని రక్షించిన వారవుతారు. మీ పేరు బయటకు రాదు. కానీ ఇలాంటి చర్యలు తీసుకుంటే అవతలివాళ్ళు 'మొహం మీద ఆసిడ్ పోస్తారనో, దారి కాచి కత్తులతో పొడుస్తారనో' అమ్మాయిలు భయ పడతారు. కానీ ఒక విషయం గుర్తుంచుకోండి. మీరెంత భయపడతారో అవతలివారు కూడా అంతే భయపడతారు. మీరు పోలీస్ స్టేషన్‌కి వెళ్ళే ధైర్యం చేయలేకపోతే ఉన్నదున్నట్లు మీ ఇంట్లో పెద్దవాళ్ళతో చెప్పండి. ఎందుకంటే వివాహం జరిగిన తరువాత ఇలాంటి విషయాలు బయటకి పొక్కితే మీరు మీ జీవితాన్నే కోల్పోవలసి రావచ్చు. ఇలాంటి విషయాలు తండ్రికి చెప్పటానికీ, భర్తకి తెలియాటానికీ తేడా ఉంది. తండ్రి రక్షించటానికి ప్రయత్నిస్తాడు. భర్త విడాకులకి ఆలోచిస్తాడు. అదీగాక, మీ పెద్దవారికి ఈ విషయం తెలిసిందని గ్రహిస్తే, మీ మాజీ స్నేహితుడు భయపడతాడు. మళ్ళీ చెపుతున్నాను. బ్లాక్ మెయిలర్స్ మనం భయపడినంత వరకే బెదిరిస్తూ ఉంటారు. ఒకసారి ఎదురుతిరిగితే వారు మనల్నొదిలేసి మరొక బలహీనమైన మనస్తత్వమున్న వ్యక్తిని లోబరుచుకోవటానికి ప్రయత్నిస్తారు.



గోపీ కిషన్, అనంతపురం:

నేను ఇంజినీరింగ్ ఫైనలియర్ చదువుతున్నాను. నాకు మా ఇంగ్లీష్ మేడం అంటే చాలా ఇష్టం. ఆవిడకు కూడా నేనంటే చాలా ఇష్టం. చాలా సార్లు గమనించాను. నేనెప్పుడూ ముందు బెంచి లోనే కుర్చుంటాను. ఆమె ఎప్పుడూ నన్ను చూస్తూనే పాఠం చెపుతుంది. కానీ ఆవిడ నాకంటే నాలుగేళ్ళు పెద్ద. ఓ అనాథ. పెళ్ళి చేసుకోవాలా? వద్దా? అనే ఆలోచనలతో కన్‌ఫ్యూజ్ అవుతున్నాను. ఆమెను అడగలేదు. ఇంట్లో చెప్పాను. మా ఇంట్లో వాళ్ళకి ఈ పెళ్ళి ఇష్టం లేదు. చాలా బాధ పడుతున్నారు. నా ఇష్టానికా లేక కుటుంబానికా ప్రాధాన్యత తెలుసుకోలేకపోతున్నాను. పరిష్కారం చూపించగలరు.

మీరు ఆమెకన్నా వయసులో పెద్దవారా? చిన్నా? అన్నది సమస్య కాదు. మీరిద్దరూ మానసికంగా ఎదిగారా లేదా అన్నదే సమస్య. ఇంతకీ... ఆమెకు మీరంటే ఏవిధమైన ఇష్టం? ఆ విషయం స్పష్టంగా కనుక్కున్నారా? సాధారణంగా లెక్చరర్లు ముందు బెంచి పిల్లలకేసి చూస్తూ పాఠం చెపుతారు. కొంపతీసి దాన్నే ప్రేమ అనుకుంటున్నారేమో ఆలోచించండి. ఇహ మీ ప్రేమ విషయానికి వస్తే... ఏదైనా సమస్యకి పరిష్కారం ఆలోచించవలసి వచ్చినప్పుడు, మనకు కలిగే లాభాలూ, (మానసికపరమైన, ఆర్థికపరమైన, సెంటిమెంటుకి సంబంధించిన) నష్టాలూ ఆలోచించుకోవాలి. ఇతరులకి వచ్చే సమస్యలని కూడా దృష్టిలో పెట్టుకోవాలి. ఉదాహరణకి మీకు పెళ్ళి కావలసిన చెల్లెళ్ళెవరైనా ఉండి, మీది సనాతనమైన కుటుంబమయితే, మీరు తీసుకుంటున్న ఈ చర్యవల్ల వారికి వివాహం జరగకపోయే పరిస్థితులు వస్తాయంటే... అది కూడా దృష్టిలో పెట్టుకోవాలి. మీ తల్లిదండ్రుల మనస్తత్వం ఎలాంటిది? మీరు తీసుకున్న నిర్ణయం వల్ల వారు కృంగి పోతారా? లేక కొంతకాలానికి మామూలుగా అయిపోతారా? ఇది బయటవారి కన్నా మీకే బాగా తెలుస్తుంది. అన్నిటికన్నా ముఖ్యమైన

విషయం ఏమిటంటే మీరు ఇంజినీరింగ్ ప్యాసవుతారా? ఒకవేళ మీరు ఇంటిలోంచి బయటకొచ్చి ఆమెను వివాహం చేసుకుంటే ఆ తరువాత మీకు వెంటనే ఉద్యోగం దొరకకపోయినా ఆవిడ తన జీతంతో మిమ్మల్ని పోషించగలదా?

శివతేజ, ఊరు రాయలేదు:

నేను ఫార్మాడి చేస్తున్నాను. నాకో మరదలు ఉంది. తనంటే నాకు చాలా ఇష్టం. ప్రేమిస్తున్నాను. ఆ విషయం తనకు చెబితే 'నో. ఫ్రెండ్స్‌లా ఉందాం, ప్రేమా గీమా వద్దు' అంది. ఎంత చెప్పినా ఒప్పుకోవడం లేదు. తనని ఎలా ఒప్పించాలి?

ఆమె ఎందుకు ఒప్పుకోవటంలేదు? మిమ్మల్ని భర్తగా చూడటం ఇష్టం లేకా? తల్లిదండ్రులు ఒప్పుకోరని భయమా? మొదటిదే కారణం అయితే మిమ్మల్ని ఆ దృష్టితో చూడలేని అమ్మాయిని చేసుకొని మీరేం సుఖపడతారు? లేదా ఆమె అభ్యంతరానికి కారణం తల్లిదండ్రులే అయితే, ఆమె తండ్రి మీ బంధువే కాబట్టి మావగార్ని డైరెక్టుగా అడిగి ఒప్పించండి. అన్నిటికన్నా ముందు మీరు చదువు పూర్తి చేయండి. ఒక ఉద్యోగస్తుడయిన తర్వాత 'అడిగే అర్హత కూడా' మీకు లభిస్తుంది. ఈ లోపులో మీ శక్తి, ఏకాగ్రత, నిద్రలేని రాత్రుల ఆలోచనలూ... అంతా చదువు మీదే ఉపయోగించండి తప్ప ఆమెను ఎలా ఒప్పించాలా అని కాదు.

ఓ సోదరి:

ఒకరిని ప్రేమించాను. సర్వస్వం అర్పించాను. కానీ తను నాకు సొంతం కాలేని పరిస్థితి. తన ప్రేమ మీద నాకు అనుమానం లేదు. తనకి నేనంటే ప్రాణం. వళ్ళో తల పెట్టుకుని చాలా ఏడుస్తాడు. నాకంటే ముందే తన జీవితంలో ఉన్న భార్యని వదులుకొమ్మని చెప్పలేను. దానివల్ల ఆయనకు సమస్యలు వస్తాయి. తన కోసమే జీవిస్తున్నాను. దూరంగానూ ఉండలేను. కానీ తనని బాధపెట్టకుండా ఉండాలంటే తన ప్రేమ ఒక్కటే చాలని అనుకోవాలి. అలా అనుకోవడం చేతకాక నలిగిపోతున్నాను. సలహా ఇవ్వండి.

తన భార్యతో ఉంటూ మీ సర్వస్వాన్నీ స్వాహా చేసిన ఆ వ్యక్తి పట్ల మీ 'ప్రేమ' ని అర్థం చేసుకోవటం చాలా కష్టం. కానీ కౌన్సిలర్ల దగ్గరకు నెలకో నాలుగు కేసులు ఇలాంటివే వస్తాయి. మీ స్నేహితుడు భార్యతో సుఖంగా సంసారం చేసుకుంటూ, సమాజంలో గౌరవంతో బ్రతుకుతూ, ఒక పెళ్ళికాని అమ్మాయిని అనుభవించేవాడు. రోజూ ఇంట్లో భోంచేస్తూ ఆదివారం పూట బయట బిర్యానీ తినే అలవాటున్న మనస్తత్వం ఉన్నవాడు. మీకు అతడి వల్ల పిల్లలు పుట్టినా, వారిని 'బాస్టర్డ్ చిల్డ్రన్' అంటారు. ఆ విషయం కూడా గుర్తు పెట్టుకోండి.



ఇప్పుడు సమస్య అతనిది కాదు. మీది. మీరు చిన్న పిల్ల కాబట్టి, తన సంసారానికి ఢోకా లేనంతవరకూ అతను అనుభవిస్తూ ఉంటాడు. మీకు వయసు పైబడిన తర్వాత మీ పట్ల అతనికి మొహం మొత్తినా, తన పిల్లలు ఎదిగి వచ్చి సెక్యూరిటీకి భంగం కలుగుతుందనుకున్నా నిర్దాక్షిణ్యంగా మిమ్మల్ని వదిలేస్తాడు. మీకు అతని పట్ల ఉన్నది ప్రేమ కాదు. వ్యామోహం. దాన్ని తగ్గించుకొని ఒక అభిరుచిని పెంచుకొని, మనస్ఫూర్తిగా (మిమ్మల్నొక్కరినే) ప్రేమించే వ్యక్తిని ఎన్నుకోండి. 'అయినా పర్వాలేదూ... నాకు సెక్యూరిటీ తప్ప ఇంకేమీ వద్దు' అని నిశ్చయించుకున్న పక్షంలో, ఆస్తి వ్రాసి ఇమ్మనండి. దానికి అతడు ఒప్పుకుంటే, మీరు అతడికి ఉంపుడుకత్తెగా ఉండిపోవచ్చు. కొందరు అలాగే చేస్తారు.

శ్రీ, ఖమ్మం:

నేను బీ టెక్ థర్డియర్. తను డిగ్రీ ఫస్టియర్. తను ఇంటర్‌లో ఉనన్ప్పుడు ఇదదర్ం లవ్ చేసుకున్నాం. డిగ్రీలో జాయిన్ అయిన తర్వాత నన్ను అవాయిడ్ చేయడం మొదలుపెట్టింది. మాట్లాడటం కూడా మానేసింది. వారం కిందట నా బర్త్‌డే పార్టీకి మా ఇంటికి వచ్చింది. ఆ రోజు నేను తనకు కేక్ తినిపించా. 'నేనంటే ఇషట్మేనా' అని అడిగా. ఇషట్మేనని చెప్పింది. అయితే, అన్నీ మ్యారేజ్ అయిన తర్వాతే అంది. నేను తననేమీ అడగలేదు. అడగకముందే అలా అనడం నాకు బాధ కలిగించింది. నేను తనను లవ్ చేయొచ్చా? ఇప్పుడు తను నన్ను నిజంగా లవ్ చేస్తోందా? ఈ పరిస్థితిలో నేనేం చేస్తే మంచిది?

ఎలాగూ 'అన్నీ' పెళ్ళి తరువాతే అన్నది కాబట్టి, అమ్మాయి విషయం మీ తల్లిదండ్రులకి చెప్పి సలహా అడగటం మంచిది.

సుజిత, నకిరేకల్:


నేను డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాను. మా కాలేజీలో ఒక లెక్చరర్ దగ్గర ట్యూషన్ కి చేరాను. అయితే ఓ రోజు నేను అందరి కంటే ముందు ట్యూషన్ కి వెళ్లాను. ఒక్కదాన్నే ఉన్నప్పుడు నేనంటే ఇష్టమని ఆయన చెప్పారు. కంగారుపడ్డాను. ఏం మాట్లాడాలో తెలియలేదు. ఆ తర్వాత చాలాసార్లు చెప్పారు కానీ పట్టించుకోలేదు. గురువుని ప్రేమించడం తప్పు అని నా ఉద్దేశ్యం. కానీ ఆయనేమో పదే పదే నాకు ప్రపోజ్ చేస్తూనే ఉన్నారు. తనకి ఎటువంటి దురుద్దేశం లేదని, నన్ను పెళ్లి చేసుకోవాలని ఉందని చెబుతున్నారు. నేను బాగా చదువుకుని సెటిలయ్యేవరకు ఎదురు చూస్తానని, కావాలంటే మా పేరెంట్స్ తో మాట్లాడతానని కూడా అంటున్నారు. నేను ఏం చేయాలి? గురువును పెళ్లాడటం తప్పు కాబట్టి 'నో' అనాలా? లేక ఆయనను నమ్మాలా? ఏమీ అర్థం కావడం లేదు. సలహా ఇవ్వండి.

ఇందులో 'నమ్మటం' అన్న ప్రసక్తి ఎక్కడున్నది? మీ అభ్యంతరం కేవలం 'గురువు' అన్నదొక్కటే అయితే, మిగతా అన్ని విషయాలూ కరెక్టుగా ఉంటే ఏమాత్రం సంశయించకుండా వివాహం చేసుకోవచ్చు. గురువును పెళ్ళాడటం తప్పు అని ఎక్కడా వ్రాసి లేదు. ఈ రోజుల్లో బీటెక్ పాసయిన కుర్రాళ్ళే తర్వాత సంవత్సరం లెక్చరర్స్‌గా పని చేస్తున్నారు. వయసులో ఎక్కువ తేడా లేకపోతే గురువుని నిరభ్యంతరంగా చేసుకోవచ్చు. మీరు వ్రాసిన ఉత్తరం బట్టి ఆ కుర్రవాడు మంచివాడిలాగానే కనబడుతున్నాడు. బెస్టాఫ్ లక్.

అనూష, మెయిల్:

నేనొక అబ్బాయిని ప్రేమిస్తున్నాను. మా ఇంట్లో పెళ్లి సంబంధాలు చూడటం మొదలు పెట్టగానే నేను ఆ అబ్బాయి గురించి చెప్పాను. కానీ నా ప్రేమ గురించి మావాళ్లు అస్సలు పట్టించుకోకుండా వేరే సంబంధాలు చూస్తున్నారు. నేను, ఆ అబ్బాయి ప్రేమ పెళ్లి చేసుకుంటే వాళ్ల పరువు పోతుందట. అంతకు మించి 'నో' అనడానికి కారణమే లేదు. నేను ప్రేమించిన అబ్బాయి జీవితంలో చక్కగా స్థిరపడ్డాడు. నన్నిచ్చి చేయడానికి అభ్యంతరం చెప్పడానికి ఏమీ లేదు. కానీ కేవలం పరువు పోతుందని వాళ్లు చూసిన సంబంధం చేసుకోమంటున్నారు. ఆరేళ్ల ప్రేమ... ఎలా మర్చిపోగలను? ఆ అబ్బాయి ఏమో... 'మీ వాళ్లు చూసిన సంబంధం చేసుకోవాలనుకుంటే చేసుకో, నీ ఇష్టం' అంటూ నిర్ణయాన్ని నాకే వదిలేశాడు. ఇప్పుడు నేనేం చేయాలి? దారి చూపండి.

ప్రతి సమస్య పరిష్కారానికీ రెండు దార్లు ఉంటాయి. చాలా సమస్యలు... ఏ మార్గం గుండా వెళ్ళాలో నిశ్చయించుకోలేకపోవటం వల్ల వస్తాయి. మీరు మీ సమస్యను విశ్లేషించుకోండి. రెండే దార్లు. అతన్ని వివాహం చేసుకోవటం. లేదా




మర్చిపోవటం. వివాహం చేసుకుంటే వచ్చే నష్టాలేంటి? మీ వాళ్ళ పరువు పోతుంది. పోయేది పరువే అయితే దానికి అంత ప్రాముఖ్యత ఇవ్వక్కర్లేదు. కాలం సర్దుబాటు చేస్తుంది. కానీ మీరు వివాహం చేసుకోవటం వల్ల మీ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు ఆగిపోవటం లాంటి విపరీత పరిణామాలుంటే మాత్రం, ఆ పరిణామాలు. తర్వాత తర్వాత మీ మనసును బాధపెట్టకుండా ఉంచుకో గలిగే నిబ్బరం మీకు ఉందా? ఇవన్నీ ఆలోచించుకోవాలి. మీ పెద్దల మనస్తత్వం మీకు తెలిసే ఉంటుంది కదా. కొన్నాళ్ళ తరువాత రాజీ కొస్తారా? లేక సినిమాల్లో చూపించినట్టూ తరాల తరబడి ఆ దూరం అలానే ఉండిపోతుందా? మీవాళ్ళని అందర్నీ వదిలేసి వెళ్ళి చేసుకునేటంత అర్హత ఉన్న వాడేనా ఆ అబ్బాయి? లేక తొలి ప్రేమ ఆకర్షణా?

రెండో మార్గం, అతన్ని మర్చిపోవటం. రకరకాల అభిరుచులు పెంచుకోవటం ద్వారా, చక్కగా వివాహం చేసుకొని భర్తను ప్రేమించటం ద్వారా మీరు అతన్ని మర్చిపోవచ్చు. మీ ప్రేమికుడు నిర్ణయాన్ని మీకు వదిలేశాడు కాబట్టి ఇవన్నీ ఆలోచించుకొని, విశ్లేషించుకొని ఓ నిర్ణయం తీసుకోండి. చిదిమేస్తున్నప్పుడు కూడా పరిమళం వెదజల్లుతూ త్యాగానికి అర్థం చెపుతుంది పువ్వు. కానీ మనం పువ్వులం కాదు. మనుష్యులం.

లక్ష్మీప్రియ, మదనపల్లి:

నేను జీఈడీ పూర్తి చేశాను. వయసు ఇరవయ్యేళ్లు. మావాళ్లు నాకో టీచరు సంబంధం చూశారు. ఏ చెడు అలవాటూ లేదు. మంచి వ్యక్తి. కట్నం వద్దంటున్నారు. మా ఇంటి బాధ్యత కూడా తనే తీసుకుంటానంటున్నారు. నాకు చాలా నచ్చారు. అయితే నాకంటే పదేళ్లు పెద్దవారని మావాళ్లు ఆ సంబంధాన్ని క్యాన్సిల్ చేశారు. నాకు ఆయన్నే చేసుకో వాలనుంది. అయినా మావాళ్లు అంగీకరించడం లేదు. వాళ్లనెలా ఒప్పించాలి?

భార్యా భర్తల మధ్య పదేళ్ళ వయసు తేడా అనేది పెద్ద సమస్య కాదు. మీరు ఆయన్ని మనస్ఫూర్తిగా ఇష్టపడుతున్నారు కాబట్టి మీ సమస్య ఆయనతోనే చర్చించండి. "మా ఇంటి బాధ్యత ఆయన తీసుకుంటానన్నారు" అని వ్రాశారు. ఈ వాక్యం అర్థం కాలేదు. మీకు తల్లీ తండ్రీ లేరా? 'మా వాళ్ళు' అంటే ఎవరు? మరింత విపులంగా రాస్తే తప్ప ఈ ప్రశ్నకి ఇంతకన్నా సమాధానం చెప్పటం కష్టం.

ప్రియాంక, ఆస్ట్రేలియా:

నేను ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో పని చేస్తున్నప్పుడు ఒక క్యాబ్ డ్రైవర్ నన్ను రెగ్యులర్ గా డ్రాప్ చేసేవాడు. చాలా మంచివాడు. దాంతో నేను క్లోజ్ గా ఉండేదాన్ని. కొన్నాళ్లకు నన్ను ప్రేమిస్తున్నానని చెప్పాడు. మొదట కాదన్నాను. కానీ అతడు నాకు చాలా ప్రాధాన్యత ఇవ్వడం, నన్నో దేవతలాగా చూడటం చూసి నేనూ ప్రేమించాను. మా ఇంట్లో వాళ్లకు విషయం చెబితే మొదటకాదన్నా తర్వాత అంగీకరించారు. తన ఇంట్లోవాళ్లు మాత్రం ఒప్పుకోలేదు. ఉద్యోగాలు, స్తోమతలో తేడాల వల్ల పెళ్లయ్యాక గొడవలు వస్తాయన్నారు. ఎంత చెప్పినా వినకుండా తనకి వేరే అమ్మాయితో నిశ్చితార్థం చేశారు. సరిగ్గా అప్పుడే నాకు ఆస్ట్రేలియాలో ఉద్యోగం రావడంతో ఇక్కడకు వచ్చేశాను. కానీ ఇద్దరం టచ్ లోనే ఉన్నాం. ఓరోజు తను సడెన్ గా ఫోన్ చేసి ఇంట్లోవాళ్లు పెళ్లికి డేట్ పెట్టేస్తున్నారని చెప్పాడు. అప్పుడు నేను... 'నా కోసం వెయిట్ చెయ్యగలిగితే చెయ్యి, లేదంటే ఆ అమ్మాయిని చేసేసుకో' అని చెప్పాను. 'సరే' అని ఫోన్ పెట్టేశాడు. అప్పట్నుంచి ఫోన్లు, మెసేజులు లేవు. నేను చేస్తే బిజీగా ఉన్నానని పెట్టేశాడు. ఆ తర్వాత అతని మూడు నంబర్లూ పని చేయడం మానేశాయి. తన ఫ్రెండ్స్ కి ఫోన్ చేసి అడిగితే ఆ అబ్బాయికి పెళ్ళయి పోయిందని, నంబర్ కూడా ఇవ్వొద్దన్నాడని చెప్పారు. నా గుండె పగిలిపోయింది. I loved him truly from my heart and became very close to him physically also. మావాళ్లేమో... ఆ అబ్బాయికి నిజంగా నీ మీద ప్రేమ ఉంటే నీకోసం wait చేసేవాడు, మర్చిపో అంటున్నారు. నేనేం చేయాలి?

అతడిని మర్చిపోవటం తప్ప మీకింకో మార్గం ఏముంది చెప్పండి! 'రంభ తా వలచి వచ్చిన..' అనే సామెత గుర్తుంది కదా. ఫిజికల్ గా ఒకసారి దగ్గరయ్యాక మగవాళ్ళకి పెళ్ళి చేసుకోవాలనే ఇంటరెస్టు సగం తగ్గిపోతుందటారు అనుభవజ్ఞులు. ఇంత జరిగాక ఇకపై మీరు దేబిరించే కొద్దీ అతనికి మీమీద అసహ్యం కూడా ఏర్పడుతుంది. కాబట్టి మీకు అతడిని మర్చిపోవటం తప్ప మరో మార్గం లేదు. గుండెలు పగలటాలూ, మళ్ళీ అతుక్కోవటాలూ మామూలే. కాలమే అరాల్డైట్‌గా పని చేస్తుంది. మనసు నెమ్మది నెమ్మదిగా సర్దుకుంటుంది.

సముద్రం ఎంత పెద్దదైనా నీళ్ళు ప్రవేశించకపోతే ఓడని ముంచలేదు. సమస్య ఎంత పెద్దదైనా, మనసులోకి రానివ్వకపోతే బాధ ఉండదు. సమస్యని 'మనసు బైటే' ఉంచి పరిష్కారం ఆలోచిస్తే సగం సమస్యలు తగ్గిపోతాయి. అలా చెయ్య కుండా మనం సమస్యని లోపలికి అహ్వానించి దుఖ సాగరంలో మునిగిపోతాం.

శశి, మెయిల్:

నేనొక అమ్మాయిని నాలుగేళ్లుగా ప్రేమిస్తున్నాను. తను సింగర్. మా ఇద్దరి పేరెంట్స్ పెళ్లికి ఒప్పుకున్నారు. కానీ అంతలో ఏమైందో ఏమో నన్ను చేసుకోనని చెప్పేసింది. తన పేరెంట్స్ తో మాట్లాడుకుని ఓ మ్యూజిక్ డైరెక్టర్ తో పెళ్లి కుదుర్చుకుంది. నేను తనని టార్చర్ చేస్తున్నందుకే అలా చేశానని అంటోంది. అది నిజం కాదు. నేనెప్పుడూ అలా చేయలేదు. అతన్ని చేసుకోవడం కోసమే తనలా చెబుతోందని అర్థమైంది. వాళ్ల పేరెంట్స్ కి ఈ విషయం తెలియదు. విషయం ఆ మ్యూజిక్ డైరెక్టర్ తో కూడా చెప్పాను. కానీ అతను తనకవన్నీ అనవసరం అంటున్నాడు. నేనా అమ్మాయిని మర్చిపోలేక పోతున్నాను. తను మళ్లీ నన్ను ప్రేమించాలంటే ఏం చేయాలి?

ప్రేమించినవారి చేత 'విదిలించుకో' బడ్డామన్న అవమానంకన్నా ఘోరమైన నరకం మరొకటి లేదు...! కానీ బాధపడకండి. మంచి స్నేహితులు మిమ్మల్ని ఎప్పుడూ వదిలెయ్యరు. అలా వదిలేసినవారు స్నేహితులు కాదు. అటువంటివారు మిమ్మల్ని వదిలేస్తే, అలా వదిలేసినందుకు మీరు అదృష్టవంతులని అనుకోండి.

ఒక కుర్రవాడు కౌన్సిలర్ దగ్గరకు వెళ్ళాడట. "ఒక అమ్మాయి నాతో కొంతకాలం స్నేహం చేసి మానేసింది. కలిసినప్పుడు మొహం తిప్పుకుంటుంది. ఫోన్ చేస్తే సరిగ్గా మాట్లాడదు. నేను చదువు మీద ఏకాగ్రత నిలపలేకపోతున్నాను. కనీసం స్నేహ పురస్సరంగానే 'బై' చెప్పి విడిపోవచ్చుగా..." అంటూ బాధ చెప్పుకున్నాడు.

''బై' చెప్పినప్పుడు, మీలాంటి వాళ్ళ రియాక్షన్ ఎలా ఉంటుందో ఎదుటివారికి తెలియదు కదా. ఇటువంటి విషయాల్లో ఎవరూ సంతృప్తి పడరు. ముఖ్యంగా మొగవారు. కొందరు లైట్‌గా తీసుకుని 'సర్లే' అనొచ్చు. మరి కొందరు వివాహ సమయంలో వెళ్ళి గొడవ చెయ్యవచ్చు. వివాహం అయ్యాక పాత మెసేజీలు చూపించి బ్లాక్ మెయిల్ చెయ్యవచ్చు. ఇంకా దుర్మార్గులైతే యాసిడ్ పోయొచ్చు".



ఆ అబ్బాయి ఏదో అడగబోయేటంతలో "...వారి సంగతి వదిలిపెట్టు. నీ విషయం ఆలోచించు. నువ్వు ప్రేమించిన అమ్మాయి నిన్ను ఎందుకు వదిలేసింది? నువ్వు నచ్చకనో, నీ కన్నా తల్లిదండ్రులు ముఖ్యమనో, నీతో కన్నా నిన్ను వదిలేస్తే భవిష్యత్తు బావుంటుందనో అనుకోవటం వల్లనే కదా మరెవరినో వివాహమాడింది. నీ ప్రేమ నిజమైనదైతే, నీ ప్రియురాలు తృప్తిగా ఉండటం కన్నా నీకేమి కావాలి? బాధ దేనికి?"

కుర్రాడు ఉక్రోషంగా, "నేను అమ్మాయినై, నా బాయ్-ఫ్రెండ్ నన్ను వాడుకుని వదిలేసినా ఇలాగే తృప్తిగా ఉండమని సలహా చెప్తారా?" అడిగాడు.

"చెప్పను. అమ్మాయిలకైతే మరోలా చెప్తాను. ఇష్టం తగ్గిపోయో, ఎక్కువ కట్నం వస్తుందనో, చెల్లికి మంచి సంబంధం వస్తుందనో, తల్లి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించటం వల్లనో నిన్ను వదిలేసేడనుకుందాం. అలా ప్రేమలో లాభనష్టాలు బేరీజు వేసుకునేవాడు దూరమైనందుకు సంతోషించాలి గానీ, బాధ ఎందుకు? అని చెప్తాను..." అని నవ్వి, "మరీ వితండ వాదనలా ఉన్నదా?" అని అడిగాడు.

"లేదు. లేదు. మీరు చెప్పేది అర్థమైంది" అన్నాడు కుర్రవాడు.

ప్రేమ ఒక కళ పుస్తకంలో వ్రాసిన పై ఉదాహరణ మీ విషయంలో సరీగ్గా సరిపోతుంది. ఆ అమ్మాయి తన 'మంచి' భవిష్యత్తు కోసం మిమ్మల్ని వదిలేసి, మరో మార్గం చూసుకుంది. అది స్వార్థమే అయ్యుండవచ్చు. కానీ పెళ్ళయ్యాక వదిలెయ్య లేదు కదా. ఇక్కడ అమ్మాయిని సపోర్ట్ చెయ్యటం కాదు. మిమ్మల్ని 'ఛీ కొట్టి' వెళ్ళిపోయిన అమ్మాయిని మళ్ళీ మీ జీవితంలోకి ఆహ్వానించాలని ఎలా అనుకుంటున్నారు? స్వాభిమానం లేదా మీకు?

పైగా, మీ ప్రేమ విషయం కాబోయే పెళ్ళికొడుక్కి చెప్పి ఆ వివాహం చెడగొట్టాలని చూస్తారా? ఇది సాడిజం కాదా? ఇటువంటి మనస్తత్వం ఉంది కాబట్టే మిమ్మల్ని బహుశా 'టార్చరర్ ' అని ఉంటుంది. ఇక మీ విషయానికి వస్తే, జరిగినది మర్చిపోయి, మీ కెరియర్ మీద దృష్టి పెట్టండి. టి-20 లో ఒక బంతి మిస్ అయితే ఆటగాడు బాధ పడుతూ కూర్చోడు. తరువాతి బంతిని ఎలా సిక్సర్ కొట్టాలా అని ఆలోచిస్తాడు. ఈ సూత్రం జీవితానికీ అన్వయించుకోవాలి.

సందీప్:

నేను బీటెక్ ఫైనలియర్ చదువుతున్నాను. నా జూనియర్ మీద నాకు చాలా ఇష్టం పెరిగింది. తనని ప్రేమిస్తున్నానేమో అనిపిస్తోంది. కానీ తనకి చెప్పలేదు. ఎందుకంటే చదువులో జూనియర్ అయినా, తను నాకంటే రెండు నెలలు పెద్దది. పైగా వేరే కులం. అయితే మా రెండు కుటుంబాలూ ఫ్యామిలీ ఫ్రెండ్స్ అవ్వడం వల్ల నాకు వాళ్ల ఫ్యామిలీతో కూడా మంచి అనుబంధం ఉంది. నా ప్రేమ విషయం తెలిస్తే ఆ అనుబంధం పాడవుతుందేమోనని భయంగా ఉంది. నిజానికి నాకు లవ్ అన్నా, ఇంటర్ క్యాస్ట్ మ్యారేజ్ అన్నా పెద్ద ఇష్టం లేదు. వాటి వల్ల పెద్దల్ని

బాధపెట్టినట్టు అవుతుందని భయం. కానీ అనుకోకుండా తనపై ప్రేమ పెరిగింది. ఇప్పుడు నేనేం చేయాలి? తనతో నా ప్రేమని చెప్పాలా? లేదంటే మా కుటుంబాల స్నేహం కోసం మనసు మార్చుకోవాలా? సలహా ఇవ్వండి.


రెండు కుటుంబాలు విడిపోకుండా ఉండటం కోసం మీ త్యాగం... ఒక మంచి బాక్సాఫీసు చిత్రానికి సరిపోయేలా ఉంది. 'అక్కడ లేని నల్ల పిల్లిని చీకట్లో వెతకటం...' అన్న సామెత బహుశ ఇక్కణ్ణుంచే పుట్టి ఉంటుంది. అంచెలంచెలుగా మీ సమస్యని విశ్లేషించుకుంటూ వెళ్దాం. ఒకవైపు ప్రేమ అంటే ఇష్టం లేదు అంటూనే, మరోవైపు 'ప్రేమిస్తున్నానేమో అ..ని..పి..స్తుం..ది' అన్నారు. ముందు మీది ప్రేమా? ఆకర్షణా? అన్న విషయం తేల్చుకోండి.

వ్యక్తిని ప్రేమించటం 'ప్రేమ'. ప్రేమ భావాన్ని ప్రేమించటం 'ఆకర్షణ' (ఇన్ ఫాచ్యుయేషన్). ప్రేమలో ఆలోచన, అవగాహన, స్పష్టత, భద్రతభావం ఉంటాయి. ఆకర్షణలో ఆవేశం. ఉద్వేగం, అస్పష్టత, అయోమయం ఉంటాయి. ప్రేమ అనుభూతి కోసం. ఆకర్షణ అనుభవం కోసం..! భవిష్యత్తు తెలియటం ప్రేమ. కాలం తెలియక పోవటం ఆకర్షణ. ప్రేమలో రోజు రోజుకీ ఎదుటి వారి గురించి ఆలోచన, నమ్మకం పెరుగుతుంది. ఆకర్షణలో రోజు రోజుకీ అనుమానం పెరుగుతుంది. మిమ్మల్ని మీరు ఈవిధంగా విశ్లేషించుకున్న తరువాత, ఆ అమ్మాయిని తన అభిప్రాయం అడగండి. ఆమె, "అసలు నాకా భావమే లేదు. నువ్వు నా కన్నా చిన్నవాడివి" అంటే అసలు గొడవే లేదు. మీకు కూడా వర్ణాంతర వివాహాలు ఇష్టం లేవు కదా.

ఒకవేళ ఆ అమ్మాయి యస్సంటే, ఇరువైపు పెద్దల్నీ సంప్రదించండి. వారు కూడా యస్ అంటే సమస్యే లేదు. కాదంటే, పెద్దవారిని ఎదిరించి వెళ్ళిపోయి వివాహం చేసుకునేటంత తీవ్రమైనదా, పెద్దల్ని బాధ పెట్టి చేసుకోవటం అవసరమా (ఈ విషయం కూడా మీరే వ్రాసారు) అనేది ఆలోచించుకోండి. మనసులోని అస్పష్టతతో బాధ పడటం కంటే, ఏదో ఒకటి తేల్చేసుకోవటమే మంచిది కదా. ఇంకో రెండు నెలల్లో పరీక్షలు. ముందు చదువు మీద ఏకాగ్రత నిల్పండి. పరీక్షలు ఫెయిలయ్యే కుర్రాళ్ళని, కాస్త ముంచు చూపున్న ఏ అమ్మాయీ ప్రేమించదు.

పద్మప్రియ:

నన్ను ముగ్గురు అబ్బాయిలు ప్రేమిస్తున్నారు. ముగ్గురికీ నేనంటే చాలా ఇష్టం. కానీ నాకు ప్రేమ మీద అంత నమ్మకం లేదు. పైగా ఒకర్ని లవ్ చేస్తే మరొకరు ఫీలవుతారని భయం. ఎవరినీ హర్ట్ చేయలేను. ఇప్పుడు నేనేం చేయాలి?



అవతలి వారిని హర్ట్ చేస్తానేమో అన్న భయంతో, ప్రపోజ్ చేసిన ప్రతివారినీ మీరు ప్రేమించటం మొదలుపెడితే, మీ ఇంటి ముందు కుర్రాళ్ళు క్యూలు కడతారు. కొన్ని లక్షల మందిని ప్రేమించవలసి వస్తుంది. ముందు మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. వ్యక్తిత్వం పెరగటానికి అది ప్రారంభం. అప్పుడు, 'ఒక అమ్మాయిని ఒక అబ్బాయి ప్రేమించటానికి ఆ అమ్మాయిలో ఏ ప్రత్యేకతా ఉండనవసరం లేద'న్న చేదు వాస్తవం మీకు అర్థమవుతుంది. ప్రేమింపబడటానికి మనకున్న అర్హతలు పెరిగేకొద్దీ, ప్రేమికులు తగ్గి ఆరాధకులు పెరుగుతారు. మహాత్మా గాంధి, మదర్ థెరిస్సాల విజయ రహస్యం అదే.

**(కొనసాగింపు వచ్చేనెల)**